ఊపిరి పోసిన వర్షం

- ఎండిపోతున్న తరుణంలో ప్రకృతి వరం
- సరుగుడు, కొబ్బరి తోటలకు ఊరట
- అకాల వర్షంతో రైతులకు మేలు

మలికిపురం: ఎండలు తీవ్రంగా ఉండే మే నెలలో వర్షాలు అంటే రైతుల కళ్లలో ఆనందమే. అందునా రాజోలు దీవిలో సముద్ర తీరంలో ఇసుక నేలలు, ఎండల తీవ్రత, ఉప్పునీటి ధాటికి సరుగుడు, కొబ్బరి తోటలు ఎండిపోతున్న తరుణంలో ఈ వర్షాలు ఊరటనిచ్చాయి. రాజోలు దీవిలో కొబ్బరి, సరుగుడు సాగు రైతులను ప్రభుత్వం కరుణించకపోయినా ప్రకృతి వరమిచ్చింది. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు తీర ప్రాంత భూముల్లో సాగవుతున్న సరుగుడు, కొబ్బరి తోటలకు చాలా ఉపయోగపడింది. ఆ ప్రాంత రైతులకు అకాల వర్షాలతో ఎడారిలో ఒయాసిస్ కనిపించిన అనుభూతిని కలిగించింది. రాజోలు దీవిలో ఆయా మండలాల్లో వారం రోజుల్లో సుమారు 40 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. మలికిపురం, సఖినేటిపల్లి మండలాలలో గోదావరి తీరంలోని గ్రామాలు, అంతర్వేది పల్లిపాలెం నుంచి కరవాక గ్రామం వరకూ సముద్రతీరంలో సుమారు 36 గ్రామాల్లో ఎండల తీవ్రత వల్ల సరుగుడు, కొబ్బరి తోటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. వేసవి వచ్చిందంటే గోదావరి, సముద్రం మధ్యలో ఉన్న గ్రామాలన్నీ ఉప్పునీటి ప్రభావానికి గురవుతాయి. అలాగే ఎండలు ధాటికి మొక్కలు చనిపోతాయి. సుమారు లక్ష ఎకరాల్లో ఈ పంటలు సాగవుతుండగా వందలాది ఎకరాలకు ఈ ప్రభావం ఇబ్బందిగా మారింది. నీరు లేక పలు చోట్ల కొబ్బరిచెట్లు చనిపోయాయి. కేవలం ఎండల వల్ల వివిధ గ్రామాల్లో రెండు వేల కొబ్బరిచెట్లు చనిపోయాయని అంచనా. సరుగుడు తోటలు కూడా అనేక ఎకరాల్లో చనిపోయాయి. ఎండల వల్ల సరుగుడు తోటలకు గొంగళి పురుగు సోకి మొక్కతోటలు చనిపోయాయి. ఈ విధంగా సరుగుడుకే రూ.50 లక్షల నష్టం వాటిల్లినట్లు రైతులు చెప్పారు. అలాగే మలికిపురం, రాజోలు, సఖినేటిపల్లి మండలాల్లోని పలు గ్రామాల్లో కొబ్బరి చెట్లకు ఆకుతేలు తెగులు సోకి కాపుపై తీవ్ర ప్రభావం చూపింది. ఈ విధంగా రాజోలు దీవిలో ఎండల వల్ల సరుగుడు, కొబ్బరి తోటల రైతాంగానికి సుమారు రూ.కోటి నష్టం వాటిల్లినట్లు అంచనా. ఎండల బారి నుంచి సరుగుడును రక్షించుకోవడానికి తోటలకు ఇంజిన్ల ద్వారా నీటిని తోడుకోవడానికి రైతాంగం రూ.లక్షల్లో ఖర్చు చేసింది. విద్యుత్ సౌకర్యం లేని ఈ గ్రామాల్లో భూములకు బోర్లు, డీజిల్ ఇంజిన్లే ఆధారం. ఉచిత విద్యుత్ సౌకర్యం లేని ఇక్కడ గత కొంత కాలంగా సబ్సిడీ అడిగిన రైతులకు ప్రభుత్వం మొండిచేయే చూపింది. ఇరిగేషన్ సౌకర్యం లేని భూములకు ఉచిత విద్యుత్ సౌకర్యం లేదు. మౌలిక వసతుల కల్పన లోపం వల్ల విద్యుత్‌కోతలు అధికంగానే ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇంకా వేసవి చాలా రోజులే ఉండగా అకాల వర్షాలు కురవడంతో రైతుల పంట పండింది. వర్షం వల్ల భూగర్భ జలాలు పెరిగాయి. తోటలకు నీరు లభించడంతో పాటు సరుగుడు తోటల్లో పలు చోట్ల పట్టిన గొంగళి పురుగు తగ్గుముఖం పట్టింది. కొబ్బరికి ఆకుతేలు కూడా తగ్గుతుందని రైతాంగం ఆశాభావం వ్యక్తం చేస్తుంది. నైరుతి రుతుపవనాలు వచ్చే వరకూ ఈ వర్షాలు తమ పొలాలను కాపాడతాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు గ్రామాల్లో అధికారుల నిర్లక్ష్యంగా నీరు చేరని పంచాయతీ చెరువులు కూడా వర్షాలకు నీరు చేరి కళకళలాడుతున్నాయి. పశువులకు, ప్రజల ఇతర అవసరాలకు నీరు లభిస్తుంది. నేల బావులు, ఇతర తాగునీటి బావుల్లో నీరు చేరింది.


బట్టేలంకలో వాన నీటితో నిండిన సరుగుడు తోటలు


వర్షాలకు కాట్రేనిపాడు లంకలో ఊపిరి పీల్చుకున్న కొబ్బరితోటలు


గంగలకుర్రులో వర్షపు నీటితో నిండిన కొబ్బరితోట

అంబాజీపేటలో..

అంబాజీపేట: అల్పపీడనం కారణంగా అంబాజీపేటలో మంగళవారం వేకువ జాము నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. గత నెల రోజులుగా సూర్యుడి భగభగలు చూసి ప్రజలు హడలిపోయారు. రోహిణి కార్తెలో చింతనిప్పులను తలపించేలా ఎండలు కాస్తూ ఉక్కబోతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. మేఘాలు కమ్ముకున్నాయి. చిన్నా, పెద్దా అందరూ హమ్మయ్య.. అంటూ ఉపశమనం పొందారు. వర్షానికి కొన్ని ప్రాంతాల్లో రహదారులు జలమయమయ్యాయి. జన జీవనం స్తంభించింది. చిరు వ్యాపారులు వర్షానికి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భారీ వర్షం వల్ల కొబ్బరి తోటలకు వ్యాపించిన తెగుళ్ల నిర్మూలనకు ఎంతో ఉపయోగకరమని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

వర్షాలు మేలు చేశాయి



ఎండలు తీవ్రంగా ఉన్న ఈ నెలలో అకాల వర్షాలు కొబ్బరి, సరుగుడు తోటల రైతులకు చాలా ఉపయోగపడ్డాయి. లేకుంటే రోజూ ఇంజిన్లకు పెట్టుబడి పెట్టాల్సి వచ్చేది. అయినా తోటలకు గ్యారంటీ ఉండేది కాదు. వర్షాలు కురిసి పంటలను కాపాడింది. తెగుళ్ల కూడా తగ్గుముఖం పడతాయి.

– ముదునూరి సత్య సీతారామరాజు, రైతు, లక్కవరం

క్లుప్తంగా

జగన్‌ను కలసిన ఐటీ వింగ్ అధ్యక్షుడు


మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి సుధాకర్ రెడ్డిని పరిచయం చేస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి

రావులపాలెం: కొత్తపేట నియోజకవర్గం ఐటీ వింగ్ అధ్యక్షుడు కొవ్వూరి సుధాకరరెడ్డి మంగళవారం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. తాడేపల్లి వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో పలువురు నాయకులు వెళ్లారు. ఈ సందర్భంగా జగ్గిరెడ్డి స్థానిక నాయకులను పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డికి పరిచయం చేశారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


చిరతపూడిలో మహిళలకు యోగాపై శిక్షణ ఇస్తున్న యోగా శ్రీనివాస్

అంబాజీపేట: యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంతో పాటు జ్ఞాపకశక్తిని పెంచుకోవచ్చని అంబాజీపేట స్వామి వివేకానంద యోగా గురువు యోగా శ్రీనివాస్ అన్నారు. చిరతపూడిలో మహిళలకు ఉచిత యోగా శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నుంచి నిర్వహిస్తున్నారు. యోగా శ్రీనివాస్ మాట్లాడుతూ యోగాలోని ప్రణామాలు చేయడం వల్ల మానసిక ఉల్లాసాన్ని పొంది మేథోశక్తి పెంచుకోవచ్చన్నారు. యోగా చేయడం వల్ల రోగాలను అదుపులో ఉంచవచ్చని, తద్వారా శరీరంలోని అన్ని అవయవాలు చురుగ్గా పని చేస్తాయన్నారు.

కాలువల ఆధునీకరణకు చర్యలు


మామిడికుదురులో గోడ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

మామిడికుదురు: పంట కాలువలను ఆధునీకరించి రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తెలిపారు. మామిడికుదురులో దెబ్బతిన్న పంట కాలువ గట్టు స్థానే రూ.10 లక్షలతో నిర్మించనున్న రిటైనింగ్ వాల్ నిర్మాణానికి మంగళవారం ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. పంట కాలువల్లో పూడిక తొలగించి రైతులకు సాగునీరు సక్రమంగా అందించే దిశగా చర్యలు చేపట్టామన్నారు. శివారు ప్రాంతాలకు సైతం సాగునీరు అందించాలన్నదే లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, ఇరిగేషన్ డీఈఈ నాగేంద్రకుమార్, ఏఈ సుందర్‌సింగ్, మానేపల్లి నీటి సంఘం అధ్యక్షులు మద్దాల తమ్మయ్య, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మట్టిలో దిగబడిన ఆర్టీసీ బస్సు


దిగబడిన బస్సు

మలికిపురం: మండలంలోని లక్కవరం–చింతలపల్లి ఆర్‌అండ్‌బీ రోడ్డులో ఆర్టీసీ బస్సు దిగబడింది. ఇటీవల ఈ రోడ్డు పనులు ప్రారంభించి అనంతరం అధికారులు నిలిపివేశారు. రోడ్డు బెర్మ్‌లు తవ్వి మట్టిని మరలా పూడ్చి వేశారు. లూజ్ మట్టిని వాహనాలు గమనించకపోవడంతో పాటు రోడ్డు ఇరుకుగా ఉండడం వల్ల బస్సు దిగబడింది. దీంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.

పూడికతీత పనులు ప్రారంభం

పి.గన్నవరం: తాటికాయలవారిపాలెం వద్ద బూరుగు చానల్‌లో రూ.5 లక్షలతో పూడికతీత పనులను ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో పి.గన్నవరం డీసీ ఉపాధ్యక్షుడు చొల్లంగి సత్యనారాయణమూర్తి, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు డొక్కా నాథ్‌బాబు, నాయకులు, ఇరిగేషన్ డీఈఈ ఆర్.నాగేంద్ర కుమార్, జేఈ సుందర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షంతో రోడ్లు అధ్వానం


పెదపట్నం రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

మామిడికుదురు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మంగళవారం భారీ వర్షం కురిసింది. భారీ వర్షంతో మామిడికుదురు మండలంలోని పలు రోడ్లు అధ్వానంగా మారాయి. రోడ్లపై భారీగా వర్షం నీరు నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పెదపట్నంలోని రత్నాపురం ఏటిగట్టు నుంచి శివాలయం వరకు రోడ్డుపై పలు చోట్ల ముంపు నీరు నిలిచిపోయింది. ఈ రోడ్డుపై ఏర్పడిన గోతుల్లో భారీగా నీరు నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర అవస్థలకు గురయ్యారు. అప్పనపల్లి సరిహద్దు నుంచి బి.దొడ్డవరం మీదుగా పెదపట్నంలంక వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు పరిస్థితి కూడా అస్తవ్యస్తంగా మారింది. మామిడికుదురు నుంచి లూటుకుర్రు ఎస్‌జీఆర్ కాలనీకి వెళ్లే రోడ్డు పరిస్థితి వర్ణనాతీతంగా ఉంది. పాడయిపోయిన రోడ్లు ప్రజల సహనానికి పరీక్షగా నిలిచాయి. ఈ రోడ్లపై ప్రయాణం నరకప్రాయంగా మారిందని స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అధ్వాన్నంగా మారిన రోడ్ల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేశారు.

జలదిగ్బంధంలో మడికి పంచాయతీ


జలదిగ్బంధంలో చిక్కుకున్న మడికి గ్రామ పంచాయతీ

ఆలమూరు: మండలంలోని మడికి గ్రామ పంచాయతీ కొద్దిపాటి వర్షానికే జలదిగ్బంధంలో చిక్కుకుంది. గ్రామ పంచాయతీ రోడ్డుకు దిగువన ఉండటంతో మంగళవారం కురిసిన కొద్దపాట భారీ వర్షానికే ఆవరణ అంతా జలమయమైంది. దీంతో సచివాలయ ఉద్యోగులు, కక్షిదారులు పంచాయతీకి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు సత్వరమే స్పందించి వర్షాకాలంలో గ్రామ పంచాయతీ ముంపునకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సీతారాములకు పరిపూర్ణాభిషేకం


హోమశాలలో ప్రత్యేక పూజలు చేస్తున్న వేదపండితులు

అయినవిల్లి: మండలంలోని అయినవిల్లిలంకలో సీతా రామచంద్రస్వామివారి ఆవిర్భావ శతాబ్ది మహోత్సవంలో భాగంగా మూడో రోజైన మంగళవారం సీతారాములకు వేదపండితుల ఆధ్వర్యంలో పరిపూర్ణాభిషేకం నిర్వహించారు. స్వామికి న్యాసార్చన, అష్టకుల పర్వతాలు, అష్ట మంగళ పంచాయుధ దర్శనం, అష్టోత్తర శత కలశాలతో సుగంధ పరిమళ చందనాది ద్రవ్యాలతో, అనేక రకాలైన ఓషధులతో మూలవిరాట్‌కు పరిపూర్ణ అభిషేకం, ఆలయ శిఖరానికి, ధ్వజస్తంభానికి మహా కుంభాభిషేకం నిర్వహించారు. అలాగే అలంకరణ సేవ, వర్ష వర్ధన దైవత్య హోమం, బాలభోగ వినియోగం, లక్ష తులసి పూజ, నీరాజన మంత్రపుష్పం, ప్రసాద వితరణ వంటి విశేష పూజలు జరిపారు. మహిళలతో సామూహిక కుంకుమార్చన పూజలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా రావులమ్మ తీర్థం

అంబాజీపేట: కె.పెదపూడిలో వేంచేసిన రాజేశ్వరి రావులమ్మ అమ్మవారి తీర్థం మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలు అమ్మవారిని దర్శించుకుని చలివిడి పానకాలు, ముడుపులు, మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన అమ్మవారి ఉయ్యాల సేవలో గ్రామ ఆడపడుచులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సోమవారం రాత్రి అమ్మవారి పూజాఘటాలను పురవీధుల్లో ఊరేగిస్తూ జాతర నిర్వహించారు. జాతరలో ఏర్పాటు చేసిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు పలువుర్ని ఆకట్టుకున్నాయి.

ఘనంగా సత్తెమ్మ తల్లి తీర్థమహోత్సవాలు


అయినవిల్లిలో సత్తెమ్మతల్లి

అయినవిల్లి: గ్రామదేవతగా పూజలందుకుంటున్న సత్తెమ్మతల్లి జాతర, తీర్థం మంగళవారం ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని భక్తి శ్రద్ధలతో దర్శించుకున్నారు. అమ్మవారికి కానుకలు, మొక్కులు సమర్పించారు. అమ్మవారి ఆలయ ప్రాగణాన్ని వివిధ పుష్పాలతో, విద్యుత్ దీపాలతో ఆలయ కమిటీ సభ్యులు సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఈ సందర్భంగా గ్రామ ఆడపడుచులు అందంగా ముస్తాబై ఆలయ ప్రాగణంలో కనువిందు చేశారు. లలితా సహస్ర పారాయణ చేశారు.

డీసీసీబీ రిటైర్డ్ బీఎం కృష్ణంరాజు మృతి


పెన్మెత్స వెంకట కృష్ణంరాజు (ఫైల్)

కొత్తపేట: జిల్లా సహకార కేంద్ర బ్యాంకు రిటైర్డ్ బీఎం పెన్మెత్స వెంకటకృష్ణంరాజు (76) మంగళవారం మృతి చెందారు. రావులపాలెం మండలం పొడగట్లపల్లికి చెందిన కృష్ణంరాజు సుదీర్ఘకాలం కొత్తపేట డీసీసీబీ బీఎంగా పనిచేశారు. షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడైన ఆయన స్థానిక ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్ ప్రెసిడెంట్‌గా పని చేశారు. రావులపాలెంలో స్థిరపడిన కృష్ణంరాజు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. శనివారం ఉదయం ఆరోగ్య పరిస్థితి విషమించి తుది శ్వాస విడిచారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కృష్ణంరాజు భౌతిక దేహానికి పలువురు శ్రద్ధాంజలి ఘటించారు.

ఎస్సీ కమిషన్ సభ్యుడిని కలసిన రాజేష్

పి.గన్నవరం: ఢిల్లీలో జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్‌ను పి.గన్నవరానికి చెందిన సహృదయ ఫౌండేషన్ చైర్మన్ పైడి రాజేష్ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఎస్సీ, ఎస్టీ చట్టంపై జిల్లా వ్యాప్తంగా అవగాహన సదస్సులు నిర్వహించి, వారిలో చైతన్యం తీసుకురావాలని రాంచందర్ సూచించారని రాజేష్ ఫోన్‌లో తెలిపారు.

రోగికి ఆర్థిక సాయం


మోరిపోడులో దుర్గాప్రసాద్‌కు సాయం చేస్తున్న సంస్థ సభ్యులు

సఖినేటిపల్లి: మండలంలోని మోరిపోడు గ్రామానికి చెందిన పేషెంట్ రాచపల్లి దుర్గాప్రసాద్‌కు మంగళవారం గల్ఫ్ శెట్టిబలిజ యువశక్తి సేవా సంస్థ రూ.20 వేలు ఆర్థిక సాయం చేసింది. దుర్గాప్రసాద్ గత కొంత కాలంగా కిడ్నీలకు సంబంధించిన సమస్యలతో బాధపడుతున్నాడు. ఈ మేరకు పై మొత్తాన్ని రాజోలు ఎంపీపీ కేతా శ్రీను, మాజీ నెడ్‌క్యాప్ డైరెక్టర్ పాటి శివకుమార్ చేతుల మీదుగా దుర్గా ప్రసాద్‌కు ఇచ్చారు. గుబ్బల శ్రీనివాస్, దొంగ మహేష్, బైరిశెట్టి వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థికీ మిత్ర కిట్లను అందజేయాలి


అంబాజీపేటలో విద్యార్థి మిత్ర కిట్లను పరిశీలిస్తున్న ఏపీఓ మమ్మి

అంబాజీపేట: ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించే ప్రతి విద్యార్థికి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను అందజేయాలని సమగ్ర శిక్ష అసిస్టెంట్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ జి.మమ్మి అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో భద్రపరిచిన విద్యార్థి మిత్ర కిట్ల స్టాక్ పాయింట్‌ను మంగళవారం పరిశీలించారు. మమ్మి మాట్లాడుతూ ప్రభుత్వం అందజేసే పాఠ్యపుస్తకాలు, బెల్ట్, క్వాలిటీ చెకింగ్ బోర్డు, డిస్‌ప్లే వాల్‌ను సమగ్రంగా అందించాలన్నారు. అందుకు అవసరమైన రికార్డులను సిద్ధం చేసుకోవాలన్నారు. మిగిలిన సామగ్రి వారం రోజుల్లోగా స్టాక్ పాయింట్‌కు చేరతాయన్నారు. పాఠశాలల వారీగా కిట్లను అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అంతకుముందు మండలానికి వచ్చిన పాఠ్యపుస్తకాలతో పాటు ఇతర వస్తువులను పరిశీలించారు. జెడ్పీ హైస్కూల్‌లో జరుగుతున్న పీఎంఎస్‌కే పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కిచెన్ గార్డెన్, ప్లే ఫీల్డ్ నిర్మాణం వేగవంతంగా చేయాలన్నారు. ఎంఈఓలు కె.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్, ఎస్ఎంసీ చైర్మన్ త్రిమూర్తులు, ఎంఆర్సీ స్టాఫ్, సీఆర్ఎంటీలు ఆమె వెంట ఉన్నారు.

విద్యా కిట్ల పంపిణీకి కార్యాచరణ


లూటుకుర్రు స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న డీఈఓ సలీంబాషా

మామిడికుదురు: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీకి కార్యాచరణ రూపొందించాలని డీఈవో షేక్ సలీం బాషా సూచించారు. లూటుకుర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్టాక్ పాయింట్‌ను మంగళవారం డీఈఓ పరిశీలించారు. విద్యార్థి మిత్ర కిట్ల ద్వారా ఆరు రకాల వస్తువులను విద్యార్థులకు ఉచితంగా అందిస్తామని ఆయన తెలిపారు. కిట్లకు సంబంధించి విద్యార్థులకు అందించే బుక్స్, బెల్టులు వచ్చాయని మిగిలిన వస్తువులు త్వరలోనే స్టాక్ పాయింట్లకు చేరవేస్తామన్నారు. ఆరు రకాల వస్తువులతో కిట్లను సిద్ధం చేసి పెట్టుకోవాలని సూచించారు. పాఠశాలలు పునః ప్రారంభం తర్వాత అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఈ కిట్లను అందించాలన్నారు. కిట్ల పంపిణీలో ఎక్కడా అలసత్వం వహించవద్దని ఉపాధ్యాయులకు డీఈఓ సూచించారు. ఒకటి నుంచి పదోతరగతి వరకు మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న విద్యార్థులు 3,343 మంది ఉన్నారని ఎంఈఓలు సీహెచ్ లక్ష్మీనారాయణ, మోకా వెంకన్నబాబు డీఈఓకు తెలిపారు.

ప్రమాద బాధితుడికి ఆర్థిక సాయం


సఖినేటిపల్లిలో బాధితుడి తల్లికి సాయం అందజేస్తున్న ఎస్సై, జెడ్పీటీసీ

సఖినేటిపల్లి: నియోజకవర్గ పరిధిలోని తాటిపాక మఠం గ్రామానికి చెందిన రోడ్డు ప్రమాద బాధితుడు కర్రి దుర్గా ప్రసాద్‌కు మంగళవారం సఖినేటిపల్లికి చెందిన ఇజ్రాయేల్ ఎన్నారై బుంగ రాజేష్ రూ.30 వేలు ఆర్థిక సాయం చేశారు. ఇటీవల దుర్గాప్రసాద్ బైక్‌పై నుంచి పడిపోయి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు సఖినేటిపల్లిలో బాధితుడు తల్లి కర్రి సత్యవతికి, స్థానిక ఎస్సై కె.దుర్గా శ్రీనివాసరావు, జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ చేతుల మీదుగా పై మొత్తాన్ని ఇచ్చారు. కుసుమ చంద్రశేఖర్, తాడి సహదేవ్, యల్లమెల్లి కిషోర్, చిత్రపు కిషోర్, వీరభద్రం, నరసింహ వర్మ పాల్గొన్నారు.

అనంతకుమారి మృతి తీరనిలోటు

పి.గన్నవరం: స్థానిక సీహెచ్‌సీలో హెడ్ నర్సుగా పనిచేస్తున్న జీఎల్ అనంతకుమారి గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలిసిందే. మంగళవారం అనంతకుమారి సంతాప సభ ఏర్పాటు చేశారు. ఆమె మృతి తీరని లోటని సీహెచ్‌సీ సూపరింటెండెంట్ యు.రాఘవేంద్రరావు అన్నారు. సంతాప సభలో అనంతకుమారి చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు సంపదరావు జి.నిర్మలాకుమారి, డి.సత్యవతి, సీహెచ్ మణితేజ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగాల పేరుతో మోసగించిన వారిపై కేసు

రాజోలు: స్మార్ట్ విలేజ్ పేరుతో ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసగించిన ముగ్గురు వ్యక్తులపై రాజోలు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. రాజోలు ఎస్సై రాజేష్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్మార్ట్ విలేజ్ సొసైటీ అసిస్టెంట్స్ ఉద్యోగాల పేరుతో 2021లో మాజీ ప్రజాప్రతినిధి ప్రైవేట్ పీఏ కె.చరణ్, కె.శ్రీకాంత్, ఎం.రాంబాబు పలువురి వద్ద డబ్బు తీసుకున్నారు. తప్పుడు ఉద్యోగ నియామక పత్రాలు ఇచ్చి మోసం చేశారని పొన్నమండ గ్రామానికి చెందిన అడబాల క్రాంతికుమార్ ఫిర్యాదు చేశాడన్నారు. క్రాంతి కుమార్‌తో పాటు బాధితులు పొన్నమండ దుర్గాప్రసాద్, సానబోయిన విజయ్ కుమార్, జిల్లెళ్ల వంశీ, జోగి రంగమూర్తి, రామ్ విలేజ్ అసిస్టెంట్స్, మండల ఎగ్జిక్యూటివ్ పోస్టులకు డబ్బు ఇచ్చి మోసపోయారన్నారు.

అయినవిల్లిలో తిరంగా ర్యాలీ


ముక్తేశ్వరం సెంటర్‌లో తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

అయినవిల్లి: ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంతో దానికి సంఘీభావంగా ముక్తేశ్వరం సెంటర్‌లో మంగళవారం సాయంత్రం బీజేపీ మండల అధ్యక్షులు కుడుపూడి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ముక్తేశ్వరం మండల కార్యాలయం నుంచి ముక్తేశ్వరం సెంటర్ నాలుగు రోడ్ల జంక్షన్ వరకు తిరంగా యాత్ర సాగింది. భారత్ మాతాకీ జై, భారత్ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. భారీ త్రివర్ణ పతాకంతో ర్యాలీ నిర్వహించారు.

మహిళలు కూడా ఈ ర్యాలీలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిలుగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీ వేమా, జాతీయ కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు నల్లా పవన్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి గనిశెట్టి వెంకటేశ్వరరావు, పి.గన్నవరం నియోజకవర్గ కన్వీనర్ చీకురుమెల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ భారత సైనికుల స్ఫూర్తిని కొనియాడారు. ఉగ్రవాదులకు తగిన బుద్ధి చెప్పారన్నారు. ఈ ర్యాలీలో పలువురు కూటమి నేతలు పాల్గొన్నారు.

కర్మకాండలకు సాయం

సఖినేటిపల్లి: మండలంలోని అంతర్వేదికర గ్రామంలో వృద్ధాప్యంతో మృతి చెందిన పేద కుటుంబానికి చెందిన అంతర్వేది ముసలయ్య దశదిన కర్మకాండలకు మానవతా మూర్తులు గ్రూపు మంగళవారం చేయూతనిచ్చింది. గ్రూపు తరఫున నగదు రూ.5 వేలు, 25 కిలోల బియ్యం మృతుని కుటుంబ సభ్యులకు అందించినట్టు గ్రూపు నియోజకవర్గ ప్రతినిధి బోణం రాజు చెప్పారు. కాగా నగదును ఒక అజ్ఞాత సోదరి, బియ్యాన్ని తన సోదరుడు విజయసారథి అందించినట్టు రాజు పేర్కొన్నారు.

లక్కవరంలో వైద్య శిబిరం

మలికిపురం: మండలంలోని లక్కవరం కెనరా బ్యాంకు నందు మంగళవారం ఉచిత వైద్య శిబిరం జరిగింది. అమలాపురం మెడ్విన్ ఆసుపత్రి ఆధ్వర్యంలో 60 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులకు సిఫారసు చేశారు. మేనేజర్ జయరామ్, బ్యాంకు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్టీఆర్ అభిమానుల రక్తదానం


పి.గన్నవరంలో రక్తదానం చేస్తున్న జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు

పి.గన్నవరం: సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్ పుట్టినరోజు వేడుకలను మండల జూనియర్ ఎన్టీఆర్ అభిమాన సంఘం ఆధ్వర్యంలో మంగళవారం పి.గన్నవరంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక బీవీఆర్ కాంప్లెక్స్‌లో ఎన్టీఆర్ అభిమానులు రక్తదాన శిబిరం నిర్వహించారు. 51 మంది యువకులు రక్తదానం చేశారు. అమలాపురానికి చెందిన సహస్ర బ్లడ్ సెంటర్ సిబ్బంది రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

హనుమజ్జయంతికి ఏర్పాట్లు

సఖినేటిపల్లి: ఈ నెల 22వ తేదీ హనుమాన్ జయంతి పురస్కరించుకుని స్వామివారి ఆలయాల వద్ద ఆయా కమిటీలు మంగళవారం ఏర్పాట్లు చేస్తున్నారు. అంతర్వేదికరలో కొలువైన హనుమాన్ ఆలయం వద్ద, మోరి శేషణ్ణరాయుడు కాలువగట్టు, మోరి మెయిన్ ఆలయాలు వద్ద, అంతర్వేది రోడ్డు సెంటర్, టేకిశెట్టిపాలెం ఏటిగట్టు ఆలయాలు వద్ద భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు వేగవంతం చేశారు.